
ఆంధ్రజ్యోతి




జయశంకర్ భూపాలపల్లి

సోమవారం 31 మార్చి 2025


కాళేశ్వరాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

# ఇంటింటా సంబురం

## ఆరు రుచులు... పంచాంగ శ్రవణాలు

- ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కవి సమ్మేళనాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ (తెలుగు నూతన) సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు పంచాంగ శ్రవణం ఆలకించారు. భూపాలపల్లి పట్టణంలోని పుష్ప ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వేడుకకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. సందర్భంగా జిల్లాలోని కవులు, కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాటారం మండలంలోని తన స్వగ్రామం ధన్వాడలోని శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉగాది పర్వదినం సందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి, శ్రీ సీతారామాంజనేయస్వామి, శ్రీ చతుర్రూప అయ్యప్ప, శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. షడ్రుచుల పచ్చడి తయారుచేసి భక్తులకు పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణం చేశారు. మహదేవపూర్ మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ, ప్రత్యేక పూజల కార్యక్రమాలు జరిగాయి. అలాగే గణపురం మండలంలోని శ్రీగణపేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉగాది పచ్చడి తయారుచేసి భక్తులకు పంపిణీ చేశారు. కాటారం లోని అభయాంజనేయస్వామి ఆలయం, రేగొండ మండలం కొడవటంచలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. షడ్రుచుల పచ్చడిని పంపిణీ చేశారు. అలాగే మల్హర్, టేకుమట్ల, చిట్యాల తదితర మండలాల్లోని ఆలయాల్లో పూజలు, పంచాంగ శ్రవణాలు జరిగాయి.


ప్రముఖ హాస్యనటుడు ఆర్‌ఎస్.నందకు సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

### ప్రతి ఇంటా బచ్చాలు.. ఉగాది పచ్చళ్లు

ఉగాది పండుగ సందర్భంగా ప్రతి ఇంట్లో షడ్రుచుల పచ్చళ్లు తయారుచేసుకున్నారు. అలాగే బచ్చాలు (పూర్ణాలు- పిండివంటలు) తయారు చేసి కుటుంబ సమేతంగా ఆరగించారు. నూతన తెలుగు సంవత్సరంలో అన్నీ శుభాలే కలగాలని ఇష్టదైవాలను కొలిచేందుకు నూతన వస్త్రాలు

(మిగతా 8వ పేజీలో)

### ఘనంగా ఉగాది వేడుకలు

- వైభవంగా మొదలైన శ్రీవిశ్వావసు నామ సంవత్సరం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు

ములుగు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను జిల్లా ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇల్లిల్లూ పండగ శోభతో నిండిపోయాయి. మామిడి తోరణాలతో ముంగిళ్లను అలంకరించారు. ఉదయమే ఇష్టదైవాలకు పూజలు చేసి కొత్తకుండలో షడ్రుచుల సమ్మిళిత పచ్చడిని తయారు చేశారు. బక్షాలు, నైవేద్యాన్ని సమర్పించి ఇంటిల్లిపాదీ సేవించారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు సమృద్ధిగా కలిగి ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ములుగులోని శ్రీక్షేత్రం, రామాలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. రామాలయంలో జాతీయ సాహిత్య పరిషత్, రామప్ప సాహితీ సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. కొండ్లె శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కవులు పాల్గొన్నారు.


ములుగులోని రామాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు



# చాంద్ నజర్ ఆగయా..

నేడు 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినం



- పూర్తయిన 29 రోజుల ఉపవాస దీక్షలు
- కనిపించిన నెలవంక.. పండుగ జరుపుకోనున్న ముస్లింలు
- నమాజ్‌కు సిద్ధమైన ఈద్గా మైదానాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన మసీద్‌లు

మహబూబాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు నియమ నిబంధనలతో చేపట్టిన ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 1న నెలవంక దర్శనంతో 2వ తేదీ నుంచి ప్రారంభమైన రంజాన్ ఉపవాసాలు ఈ నెల 30తో ముగిశాయి. చంద్ర దర్శనాన్ని బట్టి ఈ సారి 29రోజుల పాటు ఉపవాసాలు కొనసాగాయి. సౌదీ ఆరేబియాలో శనివారం సాయంత్రం నెలవంక కన్పించడంతో ఆదివారం అక్కడితో పాటు పశ్చిమ ఆసియా దేశాల్లో రంజాన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భారతదేశంలోంకూడా నెలవంక కనిపిచింది. దీంతో అన్ని ముస్లిం పెద్దల కమిటీలు సోమవారం రంజాన్ పండుగ జరుపుకునేందుకు నిర్ణయించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధానపట్టణాల్లోని ఈద్గా మైదానాలను సామూహిక ఈదుల్ ఫిత్ర్ నమాజ్ నిర్వహించేందుకు శుభ్రం చేసి ఉంచారు. ఈద్గా కమిటీల నిర్వాహకులు ఎండకాలం కావడంతో సామూహిక ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా షామియానాలు వేసి, జానిమాజ్‌లు పరిచి ఏర్పాట్లు పూర్తి

మిగతా 7వ పేజీలో...


రంజాన్ పండుగ కోసం భూపాలపల్లిలో ముస్తాబైన ఈద్గా



కాళేశ్వర బస్టాండ్

# ప్రయాణ ప్రాంగణానికి గ్రహణం

- కాళేశ్వరం బస్టాండ్ మహర్దశ ఎప్పుడు?
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- పుష్కరాలు సమీపిస్తున్నా ముందుపడని అడుగు

మహదేవపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మూడు రాష్ట్రల సరిహద్దులో ఉన్న కాళేశ్వరం బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. రూ. 3 కోట్ల 63 లక్షల నిధులు మంజూరైనా మహర్దశకు నోచుకోలేదు. మే 15 నుంచి సరస్వతీ పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ బస్టాండ్‌ను నిర్మిస్తున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. పుష్కరాలు సమీపిస్తున్నా ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

సరస్వతీ పుష్కరాలకు తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి రానున్నారు. వీరి సౌకర్యార్థం కాళేశ్వరం బస్టాండ్‌ను మోడల్‌గా నిర్మించేందుకు నిధులు రూ. 3 కోట్ల 63 లక్షల నిధులు మంజూరయ్యాయి. భక్తులు అధికంగా రానుండటం, బస్టాండ్ సరిపోకపోవడంతో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల మంత్రి నిధులను మంజూరు చేయించారు. సాత బస్టాండ్‌ను తొలగించి, దాని స్థానంలో మోడల్ బస్టాండ్‌ను కట్టనున్నారు. అయితే.. ఇప్పటి వరకు ఆ పనులు మొదలు కాలేదు. రాత్రి పూట భక్తులు వస్తే ఇబ్బందులు కలగకుండా అక్కడే బస చేసేలా అన్ని హంగులతో నిర్మించాలని అనుకున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

# పండుగ పూట విషాదం

## యువకుడి ప్రాణం తీసిన ఈత సరదా

గణపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది. పండగ పూట ఆ గ్రామంలో విషాదం అలుముకుంది. చేతికొచ్చిన కొడుకు అనంత లోకాలకు చేరడంతో ఆ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని వెల్దండి భిక్షపతి, భాగ్య దంపతులు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. ఆరేళ్ల క్రితమే కూతురు అనారోగ్యంతో మృతి చెందింది. పెద్ద కుమారుడు విజయ్ (25) ఇటీవలే బీటెక్ పూర్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాడు. పండగకు ఇంటికి వచ్చి అదే గ్రామానికి చెందిన తన మిత్రులు రామకృష్ణ, రంజిత్‌తో కలిసి గణపసముద్రం మత్తడి వద్దకు ఈతకు వెళ్లాడు. లోతైన గుంతను గమనించక ఈత కొడుతున్న క్రమంలో విజయ్ అందులో మునిగిపోసాగాడు. తోటి మిత్రులు కాపాడేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ లోతులోకి మునిపోయాడు. దీంతో తోటి మిత్రులు పోలీసులకు సమాచారం అందించారు. రెస్క్యూ సిబ్బంది సహాయంతో గాలించగా చివరకు విజయ్ మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు.


విజయ్ మృతదేహం

# గ్రూప్-1లో మెరిసిన రత్నాలు

- టీజీపీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటిన భూపాలపల్లి, ములుగు జిల్లాల యువకులు
- 28వ ర్యాంకు సాధించిన గణపురం మండల యువకుడు నవీన్
- చిట్యాలకు చెందిన గోపీకృష్ణకు 70వ ర్యాంకు
- 105వ ర్యాంకు సాధించిన ఏటూరునాగారం మండల వాసి ప్రవీణ్‌కుమార్
- గోవిందరావుపేట మండలానికి చెందిన యువకుడు మనోజ్‌రెడ్డికి 394వ ర్యాంకు


దానం నవీన్ | వెల్ది గోపీకృష్ణ | దైనంపల్లి ప్రవీణ్‌కుమార్ | ఏనుగు మనోజ్‌రెడ్డి

గణపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన 26 ఏళ్ల దానం నవీన్ టీజీపీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాడు. స్టేట్ 28వ ర్యాంకు, మల్టీ జోన్ 14వ ర్యాంకు సాధించి సత్తాను చాటాడు. కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు దానం సమ్మయ్య- రమ దంపతుల కుమారుడు సమ్మయ్య- రమ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు నవీన్‌తోపాటు కూతురు ఉంది. నవీన్ విద్యాభ్యాసం తొలి నుంచే ప్రభుత్వ విద్యా సంస్థల్లో కొనసాగింది. ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలో చదివాడు. ఐదో తరగతి నుంచి పది వరకు రెసిడెన్షియల్ గురుకులం, ఆ తర్వాత హైదారాబాద్‌లోని మసాబ్‌ట్యాంక్ ప్రభుత్వ కళాశాలలో ఇంజనీరింగ్ డిప్లొమా చేశాడు. అనంతరం హైదరాబాద్‌లోనే వీజేఐటీ కళాశాలలో 2021లో బీటెక్ పూర్తి చేశాడు. చిన్నప్పటి నుంచే చదువుల్లో చరుగ్గా ఉన్న నవీన్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1 ఫలితాల్లో స్టేట్ 28వ ర్యాంకు, మల్టీజోన్‌లో 14వ ర్యాంకు సాధించిన నవీన్ పలువురి మన్ననలు పొందుతున్నాడు. యూపీఎస్సీకి కూడా ప్రిపేర్ అవుతున్నానని, కలెక్టర్ సాధించడమే తన ఆశయమని అని అతడు చెప్పాడు.

### మెరిసిన గుంటూరుపల్లి వాసి

చిట్యాల (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన వెల్ది గోపీకృష్ణ ఆదివారం టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూప్ 1 జనరల్ ఫలితాల్లో 70వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన వెల్ది నాగేశ్వర్‌రావు, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివిస్తున్న నాగేశ్వర్‌రావు ఎనిమిది నెలల క్రితం మృతి చెందాడు. ఈ దంపతుల పెద్దకుమారుడు గోపీకృష్ణ పదో తరగతి వరకు వరంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. హైదరాబాద్‌లోని ఓప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించాడు. అక్కడే నల్లమల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగంలో ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో పోటీ పడిన గోపీకృష్ణ ఏడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. చివరకు నీటిపారుదల శాఖలో ఏఈగా చేరి కొంత కాలం పనిచేశాడు. ఇటీవల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా ఎంపికై ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలోనే గోపీకృష్ణ 2024లో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలకు హాజరయ్యాడు. రాష్ట్ర స్థాయిలో 70వ ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

### గోపీకృష్ణకు పలువురి సన్మానం

గ్రూప్ 1 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన గోపీకృష్ణను ఆదివారం స్వగ్రామంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, సాహిత్యం, కవి, రచయిత శాఖమూరి రవి, అందె కుమార్, తాజా మాజీ సర్పంచ్ పువ్వాటి రాణి వెంకటేశ్వర్లు శాలువాలతో సత్కరించారు.

### సత్తాచాటిన ప్రవీణ్.. మనోజ్‌రెడ్డి

ములుగు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో ములుగు జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు ర్యాంకులు సాధించారు. ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘణపురానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్‌కుమార్ 105వ ర్యాంకు సాధించగా, గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన ఏనుగు మనోజ్‌రెడ్డి 394వ ర్యాంకు సాధించాడు.

### పారిశుధ్య పనులు చేస్తూ మనవడిని చదివించిన నాయనమ్మలు

ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘణపూర్‌కు చెందిన దైనంపల్లి ప్రవీణ్‌కుమార్ కడు పేదరికాన్ని ఎదుర్కొని గ్రూప్-1లో అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు రజిత-సమ్మయ్యలు మరణించడంతో ప్రవీణ్‌కుమార్ తన తమ్ముడు, చెల్లితో కలిసి అనాథగా మారాడు. ఆర్టీసీ బస్టాండ్, గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తున్న నాయనమ్మలు ఎల్లమ్మ, సమ్మక్క వారిని చేరదీసి చదివించారు. పదోతరగతి వరకు స్థానిక ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న ప్రవీణ్‌కుమార్ జాకారం సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ చదివిన ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు ట్యూషన్ చెబుతూ హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్.శంకరన్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లి విఫలమయ్యాడు. మొదటి ప్రయత్నంలో గ్రూప్-1లో 105వ ర్యాంకు సాధించాడు. అన్నను ఆదర్శంగా తీసుకున్న అతని తమ్ముడు ప్రకాశ్ గ్రూప్-4లో విజయం సాధించాడు. ఏటూరునాగారం జీసీసీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నాయనమ్మల కష్టం, స్నేహితుల సహకారంతోనే తాను విజయం సాధించానని ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

### గ్రూప్-1 నుంచి గ్రూప్-4వరకు ర్యాంకులే ర్యాంకులు


గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన ఏనుగు వాసవి-రవీందర్‌రెడ్డి దంపతులకు మనోజ్‌రెడ్డి, హన్వితరెడ్డి సంతానం. మనోజ్‌రెడ్డి గ్రూప్-1లో 394వ ర్యాంకు సాధించాడు. 2011-12 విద్యా సంవత్సరంలో ములుగు సమీపంలోని ప్రేమ్‌నగర్ వివేకవర్ధిని పాఠశాలలో ఎస్సెస్సీ పూర్తి చేసిన మనోజ్‌రెడ్డి హనుమకొండలో ఇంటర్, ములుగు మహర్షి కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో 2018 నుంచి ప్రిపేర్ అవుతున్నాడు. మూడుసార్లు ప్రయత్నం

(మిగతా 8వ పేజీలో)

# సన్న బియ్యం పంపిణీ చారిత్రాక నిర్ణయం

- రేషన్‌కార్డుల ద్వారా పంపిణీ
- వేల కోట్ల అదనపు భారం పడుతున్నా ఎన్నికల హామీని నెరవేర్చాం
- విడతల వారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- రాష్ట్ర ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసే పథకం ప్రజాప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వంపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని తెలిసినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు విశ్వావసునామ సంవత్సర ఉగాది కానుకగా సీఎం రేవంత్ రెడ్డి సూర్యాపేటలో సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. మండలంలోని ధన్వాడలో మంత్రి శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ డీలర్లు ఏప్రిల్ మొదటి వారం నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తారన్నారు. బహిరంగ మార్కెట్లో కిలో సన్న బియ్యం రూ.50-60వరకు ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సుమారు 90లక్షల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా బియ్యం అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి సరిగా లేకున్నా ప్రభుత్వం విడతల వారీగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అవి నిరంతరాయంగా కొనసాగుతాయని ఉద్ఘాటించారు. తెలుగు సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆ భగవంతుణ్ని కోరుకున్నామన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల కోసం పలు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్లు తోటపల్లి ప్రశాంత్, చల్ల తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, యూత్ మండల అధ్యక్షుడు మహేష్, టీపీసీసీ కార్యదర్శి సుగుణ, మండల అధ్యక్షురాలు మహేశ్వరి, మాజీ ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, రాణిబాయి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజబాపు, నాయకులు దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, రమేష్‌రెడ్డి, లచ్చిరెడ్డి, విలాస్‌రావు, శ్రీహరి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్, కుమార్, ఉంసింగ్, నరేష్, అశోక్ రాజబాబు, రజనీకుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

# ‘యువ వికాసం’లో ఆదాయ ధ్రువీకరణ తొలగింపు




కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మీసేవ పోర్టల్ మొరాయించడంతో ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తుదారులు

- వందల సంఖ్యలో క్యాస్ట్, ఇన్‌కం దరఖాస్తులు
- దరఖాస్తు ప్రతిని హెల్ప్‌డెస్క్‌ల్లో అందజేయాలని సూచన
- ఎల్లుండి నుంచి ఆన్‌లైన్ మరింత బిజీ

కేసముద్రం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే మీసేవ, రాజీవ్ యువ వికాసం పోర్టళ్లు పలుమార్లు మొరాయిస్తుండడంతో దరఖాస్తుదారులు హైరానా పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక స్వావలంబన సాధించేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈపథకం అమలు చేయనున్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. 60 నుంచి 80 శాతం వరకు ప్రభుత్వం రాయితీతో బ్యాంకు లింకేజీతో ఆర్థిక సహాయం అందిస్తూ స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా ఈ పథకాన్ని రూపొందించారు.

**దరఖాస్తు కోసం కావాల్సినవి, అర్హతలు**

- ఆధార్ కార్డు
- పాన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- దరఖాస్తుదారుడి ఫొటో
- సెల్ నెంబరు
- ఖాతా ఉన్న బ్యాంకు పేరు, బ్రాంచ్
- అర్జీదారుడు తప్పనిసరిగా ఏదైనా రేషన్‌కార్డులో ఉండాలి.
- ఒక రేషన్‌కార్డుకు ఒక్కరే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- 21-55 ఏళ్ల మధ్య ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి
- విద్యార్హతలు లేనివారికి, ఉన్నవారికీ అవకాశం

### దరఖాస్తు ప్రతులను హెల్ప్‌డెస్క్‌లో ఇవ్వాలి

ఈ పథకం అమలు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లు, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, బీసీ ఫెడరేషన్ విభాగాలుగా ఆన్‌లైన్‌లో ‘TSOBMMSNEW.CGG.GOV.IN’ పోర్టల్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రింట్ తీసుకొని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి జిల్లాలోని 18 మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం నుంచి ఏర్పాటు చేసిన ‘రాజీవ్ యువ వికాసం హెల్ప్‌డెస్క్’లలో అందజేయాలని అధికారులు సూచించారు. మునిసిపల్ పరిధిలో ఉన్న గ్రామాల అర్జీదారులు తమ దరఖాస్తు ప్రతులను మునిసిపాలిటీ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఈ పథకానికి ఏప్రిల్ 5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన అర్హుల ఎంపిక కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తారు. రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న లబ్ధిదారులకు పథకం మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

### సర్టిఫికెట్ల కోసం హైరానా..

రాజీవ్ యువ వికాసం పథకానికి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉండడంతో వందల సంఖ్య లో ఒకేసారి సర్టిఫికెట్లకోసం మీసేవ కేంద్రాలకు దరఖాస్తుదారులు పరుగులు తీస్తున్నారు. దీంతో ఒక్కో మండలానికి సాధారణంగా రోజుకు 25 నుంచి 30 దరఖాస్తులు వస్తుండగా గత నాలుగైదు రోజుల నుంచి రోజుకు 300 నుంచి 400 దరఖాస్తులు రావడం గమనార్హం. ఈ క్రమం లో మీసేవ పోర్టల్ రెండు రోజులుగా పలుమార్లు మొరాయిస్తోందని జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లోని పలువురు సిబ్బంది తెలిపారు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రా ల జారీకి ఆటంకం ఏర్పడుతోంది.

### ఆంధ్రజ్యోతి కథనంతో ‘ఆదాయం’ ఐచ్ఛికం

‘యువ వికాసం ఆన్‌లైన్‌కు అవాంతరాలు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో ఈ నెల 24న ప్రచురితమైన కథనంతో ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుల ఇబ్బందులను ప్రస్తావించగా ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రం ‘తప్పనిసరి’ కాకుండా ఐచ్ఛికం చేసి ప్రభుత్వం తొలగించడంతో దరఖాస్తుదారులకు కొంత ఊరట లభిస్తోంది. దీంతో మీసేవ, తహసీల్దార్ కార్యాలయాలపై కొంత భారం తగ్గినట్లయింది. మరోవైపు రాజీవ్ యువ వికాసం పోర్టల్ కూడా పలుమార్లు మొరాయిస్తుండడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. సోమ, మంగళవారాలు సెలవులు ఉండడం, ఏప్రిల్ 5 చివరి తేదీ కావడంతో బుధవారం నుంచి మళ్లీ అటు మీసేవ, ఇటు రాజీవ్ యువ వికాసం పోర్టల్‌లు బిజీగా మారనున్నాయి.




కేసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ యువశక్తి హెల్ప్‌డెస్క్

## వీరభద్రస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



దేవాలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమానికి హాజరైన భక్తులు

కురవి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రెడ్యాల శ్రీనివాస్ పంచాంగ శ్రవణాన్ని విన్పించారు. వ్యక్తుల ఆదాయ, వ్యయాలు, రాజ్యపూజం, అవమానాలు, కందాయ ఫలాలు, రాశి ఫలాలు, జాతక వివరాలను వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఈవో సత్యనారాయణ, మాజీ చైర్మన్ మేక దామోదర్ రెడ్డి, ధర్మకర్తలు చిన్నం గణేష్, బాలగాని శ్రీనివాస్, దొంగల జనార్దన్‌రెడ్డి, గ్రామస్థులు నూతక్కి నర్సింహారావు, సాంబశివరావు, ఎర్ర నాగేశ్వర్‌రావు, గుమ్మళ్ల సురేందర్, కానుగంటి సత్యనారాయణ, దిడ్డి శ్రీను పాల్గొన్నారు. ఉగాది పర్వదినం కావడంతో వీరభద్రస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వాహన పూజలతో పాటు మొక్కులు తీర్చుకున్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో
# రూ.కోట్ల నిధులు ల్యాప్స్

మరిపెడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో మరిపెడ మండలం స్వచ్ఛ భారత్ ప్రోగ్రాంకు చెందిన రూకోట్ల నిధులు ల్యాప్స్ అయ్యాయని, అందుకు కారకులైన వారిని గుర్తించి సస్పెండ్ చేయాలని సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 44 జీపీలకు సంబంధించిన వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం ఈ నిధులను మార్చి 31లోపు వాడుకోవాల్సి ఉంది. పంచాయతీ కార్యదర్శులపై మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేక ఈ నిధులన్నీ మిగిలిపోయాయి. ఉమ్మడి నీలికుర్తి రూ.2.16లక్షలు, ఆనేపురం రూ.8లక్షలు, గుండెపూడి రూ.8లక్షలు, తానంచర్ల రూ.10లక్షలు ఇలా అనేక గ్రామాలకు చెందిన స్వచ్ఛ భారత్ నిధులు వినియోగించు కోకపోవడంతో ఆ నిధులు మళ్లీ కేంద్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఓ వైపు పల్లెల్లో మరుగుదొడ్లు లేక నిరుపేదలు అనేక అవస్థలు పడుతున్నా అధికారులకు పట్టింపు లేదని ఆయన వాపోయారు. సమగ్ర విచారణ చేసి కారకులను సస్పెండ్ చేయాలన్నారు. అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, నారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి కేయూ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 21 నుంచి కేయూ వర్సిటీ దూరవిద్య కేంద్రం ఇయర్‌వైజ్ ప్రీవియస్ ఏడాది, ఫైనల్ ఇయర్ ఎక్స్ అభ్యర్థులకు సైకాలజీ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ కట్ల, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు షెడ్యూల్‌ను వెలువరించారు. మొదటి, రెండో ఏడాది అభ్యర్థులకు ఏప్రిల్ 21, 23, 25, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గగంటల వరకు ఫైనల్ ఇయర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 30, మే 1 తేదీల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు 1, 2 బ్యాచ్‌ల వారిగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగతాయని వెల్లడించాయి. ఫైనల్ ఇయర్ పరీక్షలు 29, 30, మే 1, 2, 3, 5వ తేదీల్లో బ్యాచ్‌ల వారిగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## వీరారం మల్లన్న గుడిలో చోరీ

మరిపెడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారం మల్లన్నగుడిలో చోరీ జరిగిందని అక్కడి యాదవ కులస్థులు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకొని పూజలు చేయడానికి వెళ్లగా, ఆలయ గేట్ తాళాలు రాత్రి పగలగొట్టి హుండీలోని నగదును దొంగలు అపహరించినట్లు గుర్తించారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు యాదవ కుల పెద్దలు పేర్కొన్నారు. గతంలో కూడా చోరీ జరిగిన విషయాన్ని గుర్తు చేశారు.

## హైదరాబాద్‌లో వాజేడు యువకుడి ఆత్మహత్య

- ఫ్లైఓవర్ వంతెనపై నుంచి దూకి బలవన్మరణం

వాజేడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వాజేడు మండలంలోని సుందరయ్య కాలనీకి చెందిన అల్లి రాంబాబు, వరలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు అల్లి సాయి ప్రకాశ్(21) భద్రాచలంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. సాయి కొంతకాలంగా బైక్ కావాలని ఇంట్లో అడుగుతున్నాడు. తమ ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండటంతో తర్వాత కొనిస్తామని తల్లిదండ్రులు చెప్పారు. ఎలాగైనా బైక్ కొనుక్కోవాలని అనుకున్న సాయి ప్రకాశ్ హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. 20 రోజులుగా అక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో కొడుకును ఎలాగైనా నచ్చజెప్పి ఇంటికి తీసుకొద్దామని తండ్రి రాంబాబు శనివారం హైదరాబాద్ బయల్దేరాడు. కొడుకును అతడి రూమ్ నుంచి తీసుకొస్తుండగాద మార్గమధ్యలో టిఫిన్ చేసేందుకు ఆగారు. తన బైక్ కోరిక నెరవేరలేదని మనస్తాపంతో ఉన్న సాయి ప్రకాశ్ తండ్రి కళ్లుగప్పి పక్కనే షాపూర్ ఫ్లైఓవర్ ఎక్కి పైనుంచి దూకాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని తండ్రి రాంబాబు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే సాయిప్రకాశ్ మృతి చెందాడు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



సాయిప్రకాశ్ మృతదేహం

పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాంబాబు, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు సాయిప్రకాశ్ మృతితో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. సుందరయ్య కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### ప్రేమ వ్యవహారం కారణమా?

అల్లి సాయిప్రకాశ్ ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కూడా కారణం కావచ్చని గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంత కాలంగా అతడు ఓ యువతి ప్రేమలో ఉన్నాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ అమ్మాయి కోసం హైదరాబాద్‌లో అతడు ఉంటున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న రాంబాబు కొడుకును నచ్చజెప్పి తీసుకువద్దామని హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలోనే మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

## గ్రూప్-1లో హనుమకొండ జిల్లా వాసికి 4వ ర్యాంకు



వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గూప్-1 ర్యాంకుల్లో హనుమకొండ జిల్లా వాసి 4వ ర్యాంకు సాధించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబం జిన్నా విజయ్‌పాల్‌రెడ్డి-హేమలత దంపతుల కూతురు జిన్నా తేజస్వినిరెడ్డి గ్రూప్-1 పరీక్షల్లో 532.5 మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యే అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. చిన్ననాటి నుంచి చురుకుగా ఉండే తేజస్వినిరెడ్డి 2019లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో అర్హత సాధించి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో పంచాయతీ అధికారిగా పనిచేశారు. కాగా, ప్రస్తుతం గ్రూప్-1లో 4వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ అవకాశాన్ని సాధించారు. కాగా, జిన్నా తేజస్విని రెడ్డి హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసి హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ విభాగంలో పట్టభద్రురాలయ్యారు. టెన్త్‌లో 559 మార్కులు సాధించగా, ఇంటర్‌లో 966, ఇంజనీరింగ్‌లో 85.5 శాతం మార్కులు సాధించారు.

# క్వారీ.. లారీ.. ఓ దందా

- మళ్లీ మొదలైన ‘లోకల్’ వ్యాపారం
- ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు



ఎల్‌అండ్‌టీ రోడ్డుపై లోకల్ పేరుతో వెళ్తున్న లారీలు



ఆందోళన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

మహదేవపూర్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుక క్వారీల్లో లోకల్ పేరిట దందా మళ్లీ మొదలైంది. ఒక్కో లారీకి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక క్వారీల్లో అదనపు బకెట్, పాసింగ్ చార్జీలకు కళ్లెం పడటంతో కొత్త రకం దందాకు తెరలేపుతున్నారు. ఇందులో ఆ శాఖ అధికారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మహదేవపూర్, బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అంబట్‌పల్లి-1, 2 క్వారీల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి క్వారీలో రోజుకు 50కి పైగా లారీలు లోకల్ పేరుతో అక్రమ లోడింగ్‌కు వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా దూరప్రాంతాల నుంచి వచ్చి రోజుల తరబడి క్యూలో ఉన్న లారీ సీరియల్ రావడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలను నియంత్రించాల్సిన టీజీఎండీసీ సిబ్బందే చేతివాటం ప్రదర్శిస్తూ లోకల్ పేరిట లారీలను లోడింగ్‌కు పంపిస్తున్నారంటూ పలువురు డ్రైవర్లు బాహాటంగానే చెబుతున్నారు.

### నాలుగు రోజులైనా లోడింగ్ లేదు..

నాలుగైదు రోజులుగా లోడింగ్ కోసం ఎల్‌అండ్‌టీ రోడ్డుపై సీరియల్‌లో ఉన్నామని, ఇప్పటి వరకు తమ వంతు రాలేదని ఎల్కేశ్వరం ఇసుక క్వారీ వద్ద క్యూలో ఉన్న లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ‘మా లారీల సీరియల్ ఇప్పటి వరకూ రాలేదు. కానీ లోకల్ అంటూ వచ్చిన లారీలనే మళ్లీ తెచ్చి లోడ్ చేయించుకుని వెళ్తున్నారు’ అని అంటున్నారు. ఇదేమటని అడిగితే మేం లోకల్.. మమ్మల్ని ఎదురిస్తే మీ లారీ ఇక్కడ నుంచి కదలదంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. ‘కనీసం మంచినీరు కూడా ఇక్కడ అందుబాటులో లేవు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. స్వయాన టీజీఎండీసీ అధికారులే వచ్చి లారీలను అక్రమంగా లోడింగ్‌కు పంపిస్తున్నారు’ అని తెలిపారు. ఈ విషయమై స్థానిక పీవో శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించ లేదు. విధుల్లో చేరిన కొద్ది రోజుల్లోనే పీవో తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్లు కోరుతున్నారు.

## గోదావరిలో 16 కిలోల చేప లభ్యం

వాజేడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వాజేడు మండలంలోని లోటపెటగండి గోదావరిలో ఆదివారం జాలర్లకు 16 కేజీల బొచ్చెరకం చేప వలకు చిక్కింది. దానిని మండలంలోని మురుమూరుకు చెందిన చేపల వ్యాపారి గణేష్ కొనుగోలు చేసి రూ.3,200కు విక్రయించాడు. ఇటీవల గోదావరిలో 15 కేజీలకు పైగా చేపలు వలలకు పడుతుండటం విశేషం. ఆచేపను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపారు.



16కిలోల చేపతో చేపల వ్యాపారి


## రూ.లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..

- పక్కా భవనం ఇక్కడ.. సేవలు అక్కడ
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్

నర్సింహులపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుంది. పక్కా జీపీ భవనం ఉన్నా.. సేవలు మాత్రం బోడ్కాతండా పాఠశాల భవనంలో కొనసాగుతుండడం విశేషం. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా మండలంలో ధన్‌సింగ్‌తండా, పూసల తండా, చర్లచంద్రుతండా, గోల్‌తండా, బోడ్కాతండాలను కలిపి 2018లో గోల్ బోడ్కాతండాను నూతన జీపీగా ఏర్పాటు చేశారు. పక్కా భవనం లేకపోవడంతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఒక గది నుంచి సేవలు ప్రారంభించారు. 2022-23లో ఎస్డీ ఎస్‌డీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.20 లక్షలతో పక్కాభవనం నిర్మించారు. గ్రామ పంచాయతీ భవనం వినియోగంలోకి తీసుకోకపోవడంతో నిరువయోగంగా మారింది. నూతనంగా నిర్మాణం పూర్తికావడంతో ఐటీడీఏ అధికారులు,పంచాయతీరాజ్ డీఈ మండల పంచాయతీ అధికారులకు భవనం స్వాధీనం ఆర్డర్ కాపీ సైతం ఇచ్చారు. అధికారులనిర్లక్ష్యంతో సేవలు ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతుండడం ఇక్కడి పంచాయతీ అధికారుల పనితీరుకు నిదర్శనం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నిరుపయోగంగా ఉన్న నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.




ధన్‌సింగ్‌తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం



భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని అధికారులకు అందిన ఆర్డర్ కాపీ

### త్వరలో రికార్డులు బదిలీ చేయిస్తాం..

**కిన్నెర యాకయ్య, ఎంపీడీవో, నర్సింహులపేట**



ధన్‌సింగ్‌తండాలో ఐటీడీఏ నిధులతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించింది వాస్తవమే. ఉన్నతాధికారుల నుంచి స్వాధీనం చేసుకొని ఆ భవనం నుంచే ప్రజలకు సేవలు అందించాలని ఆర్డర్ కాపీ సైతం అందింది. త్వరలో పాఠశాల గది నుంచి రికార్డులు తరలిస్తాం.

## కొమ్మాల జాతరకు భక్తుల తాకిడి

- స్వామి వారిని దర్శించుకొన్న ఎమ్మెల్యే మాధవరెడ్డి దంపతులు

గీసుగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరకు ఆదివారం భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే జాతరకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో సాధారణ క్యూలైన్‌లతో పాటు ప్రత్యేక దర్శనాల క్యూలో భక్తులు రద్దీగా మారారు. గంటల తరబడి లైన్‌లలో నిలబడి భక్తులు ఉత్సవ మూర్తులను దర్శించుకొని తరించారు. కాగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి-శాలినిరెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికి సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను సుభిక్షంగా చూడాలని స్వామిం ారిని వేడుకున్నట్లు చెప్పారు. ఆదివారం ఒక్కరోజే 15వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. శ్రీరామ నవమి వరకు ఉత్సవమూర్తుల దర్శనాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు కాండూరి రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

# స్వయం ఉపాధిలో ఉషారాణి



జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన సంచులు, పూలకుండీ కవర్లు, శుభపత్రిక

- సొంత ఆలోచనతో కుటీర పరిశ్రమ ఏర్పాటు
- భర్త సహకారంతో ప్లాస్టిక్ వినియోగంపై యుద్ధం
- ఓ వైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు పది మందికి ఉపాధి
- జ్యూట్, కాటన్ బ్యాగ్ తయారీతో గుర్తింపు
- ఆన్‌లైన్ ఆర్డర్లపై బ్యాగులపై శుభపత్రికల ముద్రణ

హసన్‌పర్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. చదువుకు తగిన ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో డీలా పడిపోతున్నారు. ఈ క్రమంలో ఏ మాత్రం ధైర్యాన్ని కోల్పోకుండా స్వయం ఉపాధిని నమ్ముకుంటున్న వారు కొందరే ఉంటున్నారు. అలాంటి వారిలో ఉషారాణి ఒకరు. తన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంతో పాటు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తే పది మందికి ఉపాధి కూడా కల్పించవచ్చని నిరూపించారు పసునూరి ఉషారాణి. తన భర్త రమేష్ సహకారంతో పర్యావరణ ఓ వైపు ప్లాస్టిక్ నిషేధం కోసం పోరాడుతూనే.. జ్యూట్, కాటన్ వస్తువుల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన పసునూరి ఉషారాణి, రమేష్ దంపతులు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగంలో స్థిరడాలనుకున్నారు. 2017లో వివాహం కాగా.. భర్త ప్రోత్సాహంతో ఎంఏ బీఈడీ పూర్తి చేశారు. ఇక భర్త రమేష్ కూడా ఎంఎస్సీ బీఈడీ పూర్తి చేశారు. వివాహానికి ముందే రమేష్ 2007లో బతుకుదెరువు కోసం హనుమకొండలో పలు కోచింగ్ సెంటర్లలో పనిచేశారు. కొంతకాలానికి సొంతంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయగా.. నష్టాలు వచ్చాయి. అయినా నిరాశకు గురికాకుండా తన భార్యతో ఒక కుటీర పరిశ్రమ ప్రారంభింపజేయాలని నిర్ణయించుకున్నారు. అదికూడా పర్యావరణహితమైన జ్యూట్, కాటన్ బ్యాగుల తయారీ కేంద్రమైతే బాగుంటుందని ఆలోచనకు వచ్చారు. అనుకున్నదే తడువుగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టులో తాము నిర్మించుకున్న ఇంటి డాబాపై ఒక రేకుల షెడ్డు ఏర్పాటు చేసి 2017 జనవరి 1న కాటన్, జ్యూట్ బ్యాగ్ తయారీ పరిశ్రమను ప్రారంభించారు. ఈ క్రమంలో జ్యూట్, కాటన్ బ్యాగులకు గిరాకీ పెరగ్గా.. ఉషారాణి తన చుట్టుపక్కన ఉన్న మహిళలను కూడగట్టి వారికి శిక్షణ నిచ్చారు. వారికి శిక్షణ ఇస్తూనే నెలనెలా వేతనం ఇచ్చి ఉపాధి రంగంవైపు మళ్లించారు. తొలుత ఐదుగురితో ప్రారంభమైన ఆ కుటీర పరిశ్రమలో ప్రస్తుతం 12మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.



**ప్రభుత్వం సహకరించాలి**

**పి. ఉషారాణి, నిర్వాహకురాలు**

నా భర్త సహకారంతోనే ఏడు సంవత్సరాలుగా జ్యూట్, కాటన్ వస్తువుల కుటీర పరిశ్రమను నిర్వహిస్తున్నా. పది మందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్నా. మార్కెట్‌లో ఈ వస్తువులకు ఆదరణ పెరుగుతోంది. పర్యావరణహిత జ్యూట్, కాటన్ వస్తువులను రాష్ట్ర వ్యాప్తంగా పరిచయం చేసేందుకు ప్రతీ జిల్లా కేంద్రంలో ఒక ఉచిత స్టాల్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలి. సమాజహితం కోసం పనిచేసే వారికి ప్రభుత్వ చేయూత లేకపోవడంతో కుటీర పరిశ్రమలు వృద్ధి చెందడం లేదు.

### జ్యూట్ బ్యాగులపై పెళ్లి పత్రికలు

వివాహ వేడుకలను వీలైనంత వినూత్నంగా జరుపుకోవాలన్న భావన అందరిలో కలుగుతుంది. అందులో మరీ ముఖ్యంగా పెళ్లి పత్రికల డిజైన్ల విషయంలో కొందరు ఎంత ఖర్చుకైనా వెనకడుగువేయరు. మరికొందరు పర్యావరణహితమైన పెళ్లిపత్రికల డిజైన్లకు ప్రాధాన్యమిస్తారు. దీంతో ఉషారాణి రమేష్ దంపతులు ఎస్ఎన్ జ్యూట్, కాటన్ బ్యాగ్ పెళ్లి పత్రికలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడి నుంచే సమాజంలో నూతన ఒరవడికి నాంది పలికారు. జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన పెళ్లి పత్రికలు మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పత్రికలు వృథా కాకుండా వాటిని తమ నైపుణ్యంతో ఇతర వాడకానికి ఉపయోగించేలా రూపకల్పన చేసి.. జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన పెళ్లి పత్రికలను బంధువులకు పంచేలా సమాజానికి పరిచయం చేశారు. వాటిని కూడా ఆకర్షనీయంగా వివిధ రకాల మోడళ్లలో తయారు చేయడం వీరి ప్రత్యేకత. ఇక మమప్లాస్టిక్ నిషేధంపై యుద్ధం ప్రకటిస్తూనే పర్యావరణ హితమైన వివిధ రకాల జ్యూట్, కాటన్ బ్యాగుల తయారీ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. లంచ్, ల్యాప్‌టాప్, స్కూల్, హ్యాండ్, ట్రావెల్ బ్యాగులు, ఫ్రిడ్జ్ షీట్స్, వాల్ కవర్లు, ఫైల్స్, పౌచెస్ లాంటి వివిధ వస్తువులు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లోకి తెస్తున్నారు.

**జ్యూట్, కాటన్ వస్తు ప్రదర్శనకు వినియోగం**

**పసునూరి రమేష్**



ఎస్ఎన్ జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన వస్తువులను మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా, వ్యాపార సంస్థలు తమ ప్రదర్శనకు వినియోగించడం చాలా సంతోషంగా ఉంది. శుభకార్యానికి అవసరమైన వారు మా సంస్థ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ కానీ తమకు ఫోన్ చేసి ఆర్డర్ చేస్తే వారికి కావాల్సిన డిజైన్లలో సంచులను తయారు చేసి అందిస్తాం. ప్రభుత్వం పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి పూర్తి తోడ్పాటునందిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

### ఆన్‌లైన్ సేవలు

కాటన్, జ్యూట్ వస్తువుల తయారీలో ఉషారాణికి కొత్త ఆలోచన వచ్చింది. ఆమె నైపుణ్యంతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను తన భర్త రమేష్ సహకారంతో ఆన్‌లైన్ ఎస్ఎన్ జ్యూట్, కాటన్ ద్వారా తయారు చేసిన వస్తువులను పరిచయం చేశారు. ఆన్‌లైన్ ఆర్డర్లపైనే వీరికి గిరాకీ పెరిగింది. నిట్, బాలవికాస, యూనివర్సిటీలు, మెడికల్ మెట్రో, కెనడా, కాడాయి, లేపాక్షి నుంచి వీరికి ఆర్డర్లు వచ్చాయి. అంతేకాకుండా ఈ సంస్థలతో పాటు స్థానికంగా పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు, సెమినార్‌లకు, స్వచ్ఛంద సంస్థలకు గిఫ్ట్ ప్యాక్‌ల ఆర్డర్లు వస్తుండటంతో వారికి కావాల్సిన డిజైన్‌లలో వారికి నచ్చిన పేర్లతో ప్రింట్ చేసి విక్రయిస్తున్నారు. ఈ బ్యాగుల తయారీకి కావాల్సిన ముడి సరుకు ఏలూరు, హైదరాబాద్ నుంచి కొనుగోలు చేస్తారు. 20రకాల రంగుల జ్యూట్, కాటన్‌ను దిగుమతి చేసుకుంటారు.



తయారు చేసిన జ్యూట్ బ్యాగులను చూపిస్తున్న నిర్వాహకురాలు, ఉద్యోగులు (ఎడమ నుంచి)

**కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు**

**ఆకుబత్తిని రమ, ఉద్యోగి**



జ్యూట్, కాటన్ వస్తువుల తయారీని ఇక్కడే నేర్చుకున్న, ఇప్పుడు ఇక్క డే ఉద్యోగిగా పనిచేస్తున్నా. నాకు నెలకు రూ.6వేలు వస్తున్నాయి. ఇది మా కుటుంబానికి ఆర్థిక ఆదుకుంటుంది.

**ఉపాధి పొందుతున్నాం..**

**జి. శబరి, కుటీర పరిశ్రమ ఉద్యోగి**



మార్కెటింగ్ చేస్తా. జ్యూట్, కాటన్ సంచుల తయారీతో తమకు ఉపాధి. మేం తయారు చేసిన వివిధ రకాల డిజైన్ల సంచులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఇప్పుడు వివిధ రకాల శుభకార్యాలకు కూడా ఆర్డర్ ఇస్తున్నారు. నెలకు రూ.9 వేల జీతం సంపాదిస్తున్నా.

# ఆమ్‌పై ఆశలు

- మామిడి దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం సమకూరేనా ?
- మామిడి తోటల్లో చెట్లకు విరగబూసిన పూత, కాత
- గాలిదుమారాలు రాకుంటే మామిడి రైతులకు లాభాలు

నర్సంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో పూత పెరిగి కాతదశకు చేరుకోవడంతో రైతుల్లో మాడిగి దిగుబడిపై ఆశలు చిగురిస్తున్నాయి. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో రెండు, మూడేళ్లుగా మామిడి తోటల్లో పూత, కాత లేదు. కాసిన కొద్దిపాటి మామిడి కాయలు కూడా గాలి దుమారాలకు నేలరాలి నష్టాల పాలయ్యారు. ఈ క్రమంలో ఈ ఏడాది కాలం కలిసి వచ్చి మంచి రోజులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. తోటల్లోని చెట్లకంటే ఇండ్లలో ప్రజలు పెంచుకున్న మామిడి చెట్లకు కాయలు అధికంగా కాశాయి. నీటి వసతి ఎక్కువగా ఉండడం వల్లే ఇండ్లలోని చెట్లకు కాత ఎక్కుగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో వివిధ రకాల పండ్లు లభిస్తున్నా మామిడి ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రతీ ఏటా వేసవికాలంలో మామిడి కాయలు, పండ్లు దిగుబడి వచ్చి మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా సీజన్ కంటే ముందే మామిడి తోటలు పూతదశకు చేరుకున్నాయి. కొన్ని తోటలు పూతదశలో ఉండగా, మరికొన్ని తోటలు పిందె దశలో, ఇంకొన్ని తోటల్లో మామిడి కాయలు విరగ కాశాయి. మూడేళ్లగా కోల్పోయిన ఆదాయం ఈ ఏడాది చేకూరుతుందన్న ఆశలు మామిడి రైతుల్లో చిగురిస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే మామిడి తోటలు పూత దశకు చేరుకున్నాయి. ఏ గ్రామంలో చూసినా మామిడి తోటల్లో పూత కాత కనిపిస్తుంది. ఏప్రిల్, మే నెల వరకు మామిడి చెట్లకున్న పిందెలు కాయలుగా మారి దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కొన్ని తోటల్లో మామిడి కాయలు బాగా కాయగా మరికొన్ని తోటల్లో పలుచగా కాయలు కాశాయంటున్నారు. తోటల్లో ఎదిగిన కాయలను కోసి మార్కెట్‌లో రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. ఉగాది పండగ రోజు తయారు చేసే ఉగాది పచ్చడికి ప్రజలకు మామిడి కాయలు అందుబాటులోకి వచ్చాయి. ఇంకా రెండు నెలలో పిందెలు కాయలుగా మారి దిగుబడి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.



నర్సంపేట శివారు లక్నెపల్లిలో మామిడి తోట

### గాలి దుమారాలు రాకుంటే ఆదాయం

ప్రతీ ఏటా మామిడి తోటలు పూత దశకు చేరుకున్న సమయంలో గాలి దుమారాలతో కూడిన వర్షాలు పడడంతో తోటల్లోని చెట్లకున్న పూత రాలి రైతులు నష్టాల పాలయ్యేవారు. గత ఏడాది నూటికి 75 శాతం తోటల్లో పూత, కాత లేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది గాలి దుమాలు లేకుంటే పూత, కాసిన కాయలు నేలపాలు కాకుండా ఉంటే రైతులకు ఆదాయం చేకూరుతుంది.

### మామిడి దిగుబడిపై ఆశలు

ఈ ఏడాది మామిడి తోటల్లోని చెట్లకు విపరీతంగా పూతపూసి పిందె, కాయ దశకు చేరడంతో తోటలపై ఆధారపడిన రైతులు దిగుబడిపై ఆశలు పెంచుకున్నారు. మూడేళ్లుగా మామిడి రైతులు నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురియడం, చెట్లకు పూత బాగా పూసి కాత దశకు రావడంతో దిగుబడి పెరుగుతుందని ఆశిస్తున్నారు.

గాలిదుమారాలు రాకుంటే ఎకరం మామిడి తోటల ద్వారా 10 నుంచి 20 టన్నుల మామిడి కాయల దిగుబడి వస్తుంది. దిగుబడి ఆశించిన మేరకు వస్తే ఎకరంలోని మామిడి తోటల ద్వారా పెట్టుబడులు పోను రూ.లక్ష నుంచి రూ.2లక్షల ఆదాయం సమకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

**వరంగల్ జిల్లాలో మామిడి సాగు**

వరంగల్ జిల్లాలో 5,960 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఇందులో నర్సంపేట డివిజన్‌లోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేటలో 360 ఎకరాలు, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, ఖిలావరంగల్, సంగెం, గీసుగొండ, వరంగల్ మండలాల్లో 5,600 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

# ఈ ఏడాది అందరికీ మంచి జరగాలి

**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



ఎడ్లబండిపై పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి సురేఖ

ఖిలా వరంగల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా తూర్పుకోటలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని మంత్రి సందర్శించారు. తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తల్లిని వేడుకున్నానన్నారు. అంతకుముందు మంత్రి ఎడ్లబండిపై పెద్దమ్మతల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ముదిరాజ్‌లు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి పెద్దమ్మతల్లికి సమర్పించారు. అంతేగాకుండా ఖిలావరంగల్, స్థంభంపెల్లి, వంచనగిరి, దూపకుంట, తదితర గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండ్లతో ఊరేగింపుగా వచ్చారు. ఈ కార్యక్రమంలో 37,38 డివిజన్ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా- దామోదర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణు, ఏనుమాముల మార్కెట్ చైర్మన్ బండి జనార్దన్, డైరెక్టర్లు గజ్జెల శ్యామ్, గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, అర్చకులు హంస వెంకన్న, కుమార్, శ్రీను, శివ, రాజు, నాగరాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న మంత్రి..

వరంగల్ కల్చరల్: భద్రకాళి అమ్మవారిని మంత్రి కొండా సురేఖ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు అర్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. మంత్రి వెంట కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# చాంద్ నజర్ ఆగయా..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నమాజ్‌కు సిద్ధం చేసిన ఈద్గా మైదానం

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం పెద్దలు మసీదులలో సైరన్ మోగించి పండుగకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### పండుగలు తెస్తున్న అనుభూతులు

పోటీ ప్రపంచంలో ఒకరినొకరు మనస్ఫూర్తిగా పలకరించుకోవడానికి సమయమే చిక్కడం లేదు. దీనికి తోడు కుటుంబాలతో కలిసి మెలిసి ఆనందంగా ప్రేమానుబంధాలను పంచుకునే రోజులు కరువవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సంప్రదాయంగా వస్తున్న పండుగలు ఎంతో కొంత వెసులుబాటుతో అనుభూతులు, ఆనందం, ఆహ్లాదం, అనుభవాలను పంచుకునేలా చేస్తున్నాయి. ఈ కోవలోనే వచ్చిన రంజాన్ పర్వదినం ఈద్-ఉల్-ఫితర్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. రంజాన్ నెల మొత్తం నియమనిష్టలతో ఉపవాస వ్రతం పాటిస్తూ రోజూ ఐదుసార్లు దైవారాధన (నమాజ్) చేశారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు.

### పండుగ నాడు గుసుల్ స్నానంతో..

పండుగనాడు ముస్లింలందరూ వేకువజామునే లేచి ఫజర్ నమాజ్‌కు వెళ్లి వస్తారు. ఆపై గుసుల్ స్నానం ఆచరించి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరిస్తారు. సుగంధ ద్రవ్యాలు పూసుకుంటారు. పండుగ సందర్భంగా ఇంట్లో తయారు చేసిన సేమియా పాయసాన్ని స్వీకరిస్తారు. పండుగకు ముందే ఫిత్రాదానం చెల్లించినప్పటికీ పండుగ రోజు కూడా పేదలకు దానధర్మాలు చేస్తారు. అందరూ సామూహికంగా తక్బీర్ పఠిస్తూ ఈద్గా మైదానాలకు చేరుకుంటారు. ఆపై ముస్లింల పెద్దను అనుసరిస్తూ నమాజ్ పూర్తి చేసుకుంటారు. ఈద్గా మైదానానికి ఒకదారి వెంట వెళ్లి మరో దారి వెంట ఇంటికి చేరుకుంటారు. తర్వాత ఖబరస్తాన్‌లకు వెళ్లి పూర్వీకుల సమాధులపై పుష్పాలు ఉంచి నివాళులర్పిస్తారు. పండుగకు తయారు చేసిన సేమ్యా, షీర్ ఖుర్మా లాంటి వంటకాలను స్నేహితులు, బంధువులకు ఆప్యాయంగా తినిపిస్తారు.

### చిన్నారులకు 'ఈదీ'

రంజాన్ పండుగ రోజున చిన్నారులకు 'ఈదీ' పేరిట ఎంతో కొంత నగదు సంతోషంగా ఇవ్వడం ఒక సంప్రదాయం. ఇది పిల్లలకు పెద్దలు ఇచ్చే విశిష్ట బహుమానం అన్నమాట. ఇందుకోసం చిన్నారులు పెద్దలను గౌరవిస్తూ... వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అలా లభించిన సొమ్ముతో తమకిష్టమైన వస్తువుల్ని పెద్దల ప్రమేయం లేకుండా కొనుగోలు చేస్తారు. మరికొందరు దానాలు కూడా చేస్తారు.

# జనరల్ టికెట్ చాలా సులభం

- డిజిటల్ చెల్లింపులతో క్షణాల్లో పొందవచ్చు
- అందుబాటులో ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్
- యూటీఎస్ యాప్ ద్వారా కూడా తీసుకోవచ్చు



కౌంటర్ వద్ద టికెట్‌లు తీసుకుంటున్న ప్రయాణికులు

గిర్మాజిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణానికి జనరల్ టికెట్ తీసుకోవాలంటే ఇదివరకు అష్టకష్టాలు పడాల్సివచ్చేది. గంట ముందుగా స్టేషన్‌కు వెళ్లడం.. చాంతాడంత క్యూలైన్‌లో నిలబడటం... టికెట్ కోసం చిల్లర డబ్బులు ఇవ్వడం.. ఇదంతా పెద్ద టాస్క్. కానీ ఇపుడు పద్ధతి మారింది. జస్ట్ స్మార్ట్ ఫోన్.. మన బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులుంటే చాలు. ప్రయాణికుడు టికెట్ కౌంటర్‌కు వెళ్లి క్యూర్ కోడ్ ద్వారా పేమెంట్ చేసి కౌంటర్‌లో టికెట్ పొందవచ్చు. కౌంటర్‌కు వెళ్లడం ఎందుకు టైమ్ దండగ అనుకుంటే.. ఆటోమెటేడ్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం) దగ్గరకు వెళ్లి యూటీఎస్ యాప్ ద్వారా డబ్బులు చెల్లించి టికెట్ పొందవచ్చు.. ఏటీవీఎం ఆపరేటింగ్ తెలియదు అనుకుంటే అక్కడే ఉండే రైల్వే సిబ్బంది సహకారం తీసుకోవచ్చు. లేదూ.. డిజిటల్ చెల్లింపులు మాకు తెలియదు అనుకుంటే నగదు చెల్లించి కూడా జనరల్ టికెట్ తీసుకొని రైలు ప్రయాణం చేయవచ్చు. ఈ సదుపాయం ప్రస్తుతం అన్ని పెద్ద రైల్వే స్టేషన్‌లలో అందుబాటులో ఉంది.

### క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ కొనుగోలు

వరంగల్ రైల్వేస్టేషన్‌లో 5 జనరల్ టికెట్ కౌంటర్లున్నాయి. ఇక్కడ నగదు చెల్లించి కూడా టికెట్ కొనుగోలు చేయవచ్చు. డిజిటల్ చెల్లింపుల ద్వారా టికెట్ తీసుకోవాలనుకుంటే కౌంటర్‌కు వెళ్లి మనం వెళ్లాల్సిన రైల్వేస్టేషన్ పేరు, కావాల్సిన టికెట్‌లను సిబ్బందికి చెప్పగానే వారు టికెట్ జనరేట్ చేస్తారు. పేమేంట్ కోసం కౌంటర్‌లోని రైల్వే క్యూఆర్ కోడ్‌కు ప్రయాణికుడు తన స్మార్ట్ ఫోన్‌లోని గూగూల్, ఫోన్ పే, యూపీఏ ద్వారా గాని డబ్బులు చెల్లించగానే సిస్టమ్ నుంచి టికెట్ వస్తుంది. అంతే కాకుండా క్యూ ఆర్ కోడ్ స్కాన్‌కు బదులుగా మొబైల్ నెంబర్ ద్వారా కూడా డబ్బులు చెల్లించవచ్చు. వెళ్లాల్సిన రైల్వేస్టేషన్, కావాల్సిన టికెట్‌లతో పాటుగా మొబైల్ నెంబర్‌ను కౌంటర్‌లోని సిబ్బందికి చెప్పగానే ప్రయాణికుడి దగ్గర ఉన్న స్మార్ట్‌ఫోన్‌కు పేమేంట్ లింక్ వస్తుంది. డబ్బులు చెల్లించగానే కౌంటర్‌లోని సిబ్బంది టికెట్ ప్రింట్ తీసి ఇస్తారు. ఇదంతా కూడా టికెట్ కౌంటర్ బయట ఉన్న పెద్ద తెరపై మనకు కనిపిస్తుంది.

### యూటీఎస్ యాప్ ద్వారా..

రైల్వేశాఖ యూటీఎస్ (అన్ రిజర్వ్‌డ్ టికెట్ సిస్టం)యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా జనరల్ టికెట్ పొందవచ్చు. అండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్ నుంచి, ఐఫోన్ వినియోగదారులు యాప్ స్టోర్, విండోస్ ఫోన్ వినియోగదారులు విండోస్ యాప్ స్టోర్‌ల నుంచి రైల్వే యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత యాప్ ఓపెన్ చేసి మొబైల్ నెంబర్, పేరు, పాస్‌వర్డు, పుట్టిన తేదీ నమోదు చేస్తే మొబైల్‌కు వన్‌టైంపాస్‌వర్డు (ఓటీపీ) వస్తుంది. దాన్ని నమోదు చేయడం ద్వారా రైల్వే యూటీఎస్ యాప్ మన మొబైల్‌లో అందుబాటులోకి వస్తుంది. మొబైల్ నెంబర్, పాస్‌వర్డుతో రైల్వే యూటీఎస్ అకౌంట్‌లోకి లాగిన్ కాగానే యూటీఎస్ అన్ రిజర్వుడ్ (యూటీఎస్‌ఐఆర్) టికెట్ కనిపిస్తుంది. ఇందులో మనం వెళ్లాల్సిన స్టేషన్, కావాల్సిన టికెట్లు, పేపర్ లెస్ టికెట్ అని యాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో డెబిట్/క్రెడిట్ కార్డులు/ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ పేమేంట్ చేయగానే స్మార్ట్ ఫోన్‌లో జనరల్ స్మార్ట్(పేపర్ లెస్) టికెట్లు డౌన్‌లోడ్ అవుతాయి. ఒక వేళ పేపర్ టికెట్ కావాలనుకుంటే యాప్‌లో ఆన్‌లైన్ పేమేంట్ చేశాక రైల్వేస్టేషన్‌లోని ఆటోమెటేడ్ టికెట్ వెండింగ్ మిషన్‌లో మొబైల్ నెంబర్, బుకింగ్ ఐడి నమోదు చేసి టికెట్లు పొందవచ్చు. అయితే రైల్వేస్టేషన్ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నపుడు మాత్రమే యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్ తీసుకునే అవకాశం ఉంటుంది.

**ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్ ద్వారా..**

టికెట్ కౌంటర్‌కు వెళ్లకుండా నేరుగా టికెట్ తీసుకునేందుకు రైల్వేశాఖ 6 ఆటోమెటేడ్ టికెట్ వెండింగ్ మిషన్ (ఏటీవీఎం)లు వరంగల్ రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఏటీవీఎం దగ్గరకు వెళ్లి టచ్ స్క్రీన్‌పై ప్రింట్ మొబైల్ టికెట్, ప్లాట్‌ఫామ్ టికెట్, బుక్ జర్నీ టికెట్, వెళ్లాల్సిన రైల్వేస్టేషన్, ఎక్స్‌ప్రెస్/సూపర్ ఫాస్ట్ రైలు తదితర వివరాలు నమోదు చేయాలి. కావాల్సిన టికెట్‌ల డబ్బులను టచ్‌స్క్రీన్‌పై కనిపించే క్యూఆర్ కోడ్‌కు గూగూల్ పే/ఫోన్ పే తదితర డిజిటల్ పేమెంట్ యాప్‌లతో స్కాన్ చేయగానే టికెట్ ప్రింట్ అయి బయటకు వస్తుంది. ఈ విషయంలో ప్రయాణికుడికి సహకరించేందుకు సిబ్బంది ఉంటారు. ఇలా కాకుండా ఏటీవీఎం దగ్గరకు వెళ్లి నగదు చెల్లించి కూడా జనరల్ టికెట్ పొందవచ్చు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం క్యూ ఆర్ కోడ్ స్కానర్, మొబైల్ నెంబర్ ద్వారా టికెట్ కౌంటర్‌లో తీసుకునే వెసులుబాటు, యూటీఎస్ యాప్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ టికెట్.., క్యూఆర్ కోడ్‌తో ఏటీవీఎం మిషన్ చెల్లింపు ఇలా మూడు రకాల డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉంది. వీటిలో ప్రయాణికులకు అనువైన పద్ధతిలో జనరల్ టికెట్‌ను కొనుగోలు చేసి ప్రయాణం చేయవచ్చు.



ఏటీవీఎం ద్వారా టికెట్ తీసుకుంటున్న ప్రయాణికులు




యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్

# ఘనంగా ఉగాది వేడుకలు


రేగొండ వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం


ఏటూరునాగారం ఏఎస్పీని సన్మానిస్తున్న అర్చకుడు

ఏటూరునాగారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ దంపతులు రామాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, ఏఎస్పీ దంపతులకు శేషవస్త్రాలతో సన్మానించారు. మాజీ సర్పంచ్ కాకులమర్రి చక్రధర్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ అలువాల శ్రీనివాస్, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ పోగుల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు కత్తెర శ్రీనివాస్, లటపెటల రాజేష్, భిక్షపతి, గాడిచర్ల సాంబయ్య, సాయి బాబా ఆలయ కమిటీ ఛైర్మన్ పెండ్యాల ప్రభాకర్, పెండ్యాల సంతోష్, ప్రసాద్, వేణుగోపాల్, లాహోటి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో నూతన సంవత్సర పనులు ప్రారంభించారు. గ్రామాల్లో పిండి వంటలు, షడ్రుచుల ఉగాది పచ్చడితో పండుగను వేడుకగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకులు పంచాగ శ్రవణాలు చదివి వినిపించారు.

● గణపురం (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే పిండి వంటలు, షడ్రుచుల పచ్చడిని ఆరగించారు. సమీపంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి పంచాంగం తెలుసుకున్నారు. మరికొందరు రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో కొత్తసాలు నిర్వహించారు. వాహనదారులు తమ వాహనాలకు పూజలు చేశారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామమైన ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించి సన్మానించారు. ఆలయంలో మంత్రి ఉగాదిపచ్చడి సేవించారు. అనంతరం రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏరువాక సాగించారు. ఎద్దులు, ఆవులకు రంగులు వేసి పండ్లు, ఫలాలు తినిపించారు. రాష్ట్రంలోని ప్రజలంతా బాగుండాలని దత్తాత్రేయ స్వామిని కోరుకున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మండలంలోని ప్రజలంతా ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించి, బూరెలు తిని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు కృష్ణమోహన్, గణేష్, ప్రవీణ్, లక్ష్మీకాంత్, సుమిత్‌పాండే ఆశిష్, సతీష్‌నాగరాజు తదితరులు ప్రత్యేక పూజలు జరిపి పంచాంగశ్రవణం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని ఆలయ అర్చకులు పణకంఠి నగేష్‌శర్మ, వేద పండితులు సుబ్రహ్మణ్యశర్మ, పాండెతో పాటు అర్చకులు ఘనంగా నిర్వంచారు. కాళేశ్వర ఆలయంలోని భక్తులు, గ్రామస్థులు ఈ పంచాంగ శ్రవణంలో పాల్గొని వారి వారి రాశులను అర్చకులు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలశాఖ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాల సందర్భంగా పచ్చడి పంపిణీ చేశారు. విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు ఆరెందుల అంకన్న, శంకర్‌సింగ్, విక్రంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ రూరల్ ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్, పలిమెల మండలాల వ్యాప్తంగా విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా జరుపు కున్నారు. షడ్రుచుల సమ్మేళనంతో ఉగదీ పచ్చడి, పిండి వంటలను ఆరగించారు. పలువురు రైతులు ఎద్దులను పూజించి ఏరువాక పనులు చేపట్టారు. మందరగిరి వేంకటేశ్వరాలయంతో పాటు పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

●మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో అర్చకులు ప్రహ్లాద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● రేగొండ ఆంధ్రజ్యోతి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో, కోటంచ లక్ష్మీనర సింహ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సందీప్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలిసి ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్లు భిక్షపతి, లింగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ఉగాది పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉగాది పచ్చడి తయారు చేసి కుటుంబ సమేతంగా పిండివంటలు ఆరగించి ఆనందంగా గడిపారు. కొందరు రైతులు ఏరువాక సాగించారు. సాయంత్రం మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి, శివాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలలో పలు పార్టీల నాయకులు, ముఖ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు పాల్గొన్నారు. దీంతో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. శివాలయం అర్చకులు శివాచార్యులతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్, ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవింద్రచారి, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, నాయకులు వైద్యుల తిరుపతిరెడ్డి, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, దొంతిరెడ్డి రవిరెడ్డి, గాదం కుమాం తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఉగాది పచ్చడిని రుచి చూశారు. మండల ప్రజలకు అధికారులు, రాజకీయ నాయకులు ఉగాది శుభాకాంక్షలను తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం ఛైర్మన్

మంగపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి మండలంలోని రాజుపేటలో వెలుగు దివ్య గ్రామైక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. డీఆర్డీఏ డీపీఎం గోవింద్ చౌహాన్, మంగపేట సహకార సంఘం ఛైర్మన్ తోట రమేష్ చేతుల మీదుగా ఈకారం చుట్టారు. ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి క్వింటాకు రూ. 2,320, దొడ్డు రకానికి రూ. 2,300 ప్రభుత్వం చెల్లిస్తోందని వారు తెలిపారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీఎం అప్పారావు, సీసీ జనార్దన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ మహోత్సవ పందిరికి పూజ


పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు

ఏటూరునాగారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో ఏప్రిల్ 6న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఉండడంతో పచ్చిని పందిరి ముహూర్త కార్యక్రమాన్ని ఆలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ఎల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ముందుగా పాలకర్రను కుంకుమ, పసుపుతో అలంకరించి కంకణాలను కట్టి కొబ్బరికాయలను కొట్టి కల్యాణ వేడుకల పందిళ్ల కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు చలువ పళ్లను వేయనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ అలువాల శ్రీనివాస్ తెలిపారు.

## గ్యాస్ గోడౌన్‌ను ఖాళీ చేయాలని 'ఫెన్‌క్విస్ట్' నోటీసులు

మంగపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమలాపురం బిల్ట్ కాలనీలో కార్మికులకు సంబంధించిన ఏపీఆర్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ గ్యాస్ సొసైటీ గోదాంను ఖాళీ చేయాలని బిల్ట్ ఆస్తులు స్వాధీనంలో ఉంచుకున్న ఫిన్‌క్విస్ట్ సంస్థ నోటీసులు జారీ చేసింది. దీనిపై పలువురు బిల్ట్ కార్మికులు మాట్లాడుతూ ఇప్పటికే ఇదే కాలనీలో ఉన్న థాఫర్ హైస్కూల్, బిల్ట్ డిస్పెన్సరీ మూసి వేశారని, ప్రస్తుతం గ్యాస్ ఆఫీస్, గోదాంను ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా కొన్ని పత్రాలపై సంతకాలు చేయాలని కార్మికులను యాజమాన్యం బెదిరింపులకు దిగుతోందని అన్నారు. గ్యాస్‌గోదాం, ఆఫీస్‌ను మార్చాలంటే అనేక నిబంధనలు ఉంటాయని తెలిసి కూడా ఇలా నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు.

## హేమాచల ఉత్సవమూర్తుల పల్లకీ సేవ


హేమాచల క్షేత్రంలో స్వామి వారి పల్లకీ సేవ

మంగపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర సింహ స్వామి దేవాలయంలో తెలుగు సంవత్సరాది శ్రీవిశ్వావసునామ సంవత్సరం సందర్భంగా ఉత్సవమూర్తులను పల్లకీలో అధిరోహించి తీరువీధుల నుంచి 3 కిలోమీటర్ల మేర మల్లూరు గ్రామం విశ్రాంతి మంటపం వరకు సన్నాయి, వాయిద్యాల నడుమ పల్లకీ సేవ నిర్వహించారు. ప్రధానార్చకుడు మక్కమల్ల రాజశేఖరశర్మ, రిటైర్డు అర్చకుడు కైంకైర్యం రాఘావచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు పల్లకికి ఎదురేగి గోదావరి జలాలను బిందెలతో ఆరబోసారు. అనంతరం అర్చకులు పవన్‌కు మారచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ, వెంకటనారా యణశర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, రాజీవ్‌నాగశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించి చుట్టు పక్క గ్రామల ప్రజలు తమ జాతకాల గురించి రాశుల వారీగా చదివి వినిపించారు. అనం తరం రాత్రి ఉత్సవ మూర్తులను శ్రీ సీతారామాచంద్రస్వామి ఆల యంలో కొలు దీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రవణం సత్యనా రాయణ, మల్లూరు గుట్ట మాజీ ఛైర్మన్లు పూజారి సమ్మయ్య, నూతలకంటి ముకుందం, చిట్యాల పురుషోత్తం, సత్యనారాయణ, పూజారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పగలూ వెలుగుడేనా..?!


పగలు వెలుగుతున్న విధి దీపం

టేకుమట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆశిరెడ్డిపల్లి రోడ్డులో రేయింబవళ్లు తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. అసలే ఎండకాలం, విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అవసరం ఎంతో ఉండగా టేకుమట్ల గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పగటి పూట వీధి దీపాలు ఆఫ్ చేయడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మహాముత్తారం, మార్చి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి(పీపీ) గ్రామానికి చెందిన చంద్రగిరి సత్తమ్మ ఇల్లు ఆదివారం దగ్ధమైంది. ఉదయం ఉగాది పండుగ సందర్భంగా ఇల్లు కడిగి ఆరడానికి కూలర్ వేయగా షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న బట్టలు అంటుకొని మంటలు ఇంటి పైకప్పుకు చేరాయి. చుట్టు పక్కల వారు మంటలను అతి కష్టమ్మీద అదుపులోకి తెచ్చారు. ఇంట్లో ఉన్న బీరువా, అందులోని నగదుతో పాటు విలువైన వస్తువులు కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది. తనను ప్రభుత్వం ఆదుకోవా లని కోరింది

## మహదేవపూర్‌లో ఎరుకుల సంఘం సమావేశం

మహదేవపూర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎరుకల సంఘం ముఖ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ ఎరుకల సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కేతిరి సుభాష్, భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్యాల రాము మాట్లాడారు. ఎరుకల నాంచారమ్మ జాతరకు ఆ సామాజిక వర్గానికి చెందిన వారందరూ పెద్ద ఎత్తున రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ సుధాకర్, సుల్తాన్ సారయ్య, శ్రీరామ రమేష్, తిరుపతి, ప్రభాకర్, కేతిరి రాకేష్ పాల్గొన్నారు.

## చెస్‌పోటీల్లో అంగన్‌వాడీ టీచర్ ప్రతిభ


బహుమతి అందుకుంటున్న అరుణ

కృష్ణకాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో జంగేడు సెక్టార్‌లోని గురిజాల గడ్డ అంగన్‌వాడీ టీచర్ మోతే అరుణ ప్రతిభ కనబరిచారు. చెస్ విభాగంలో పాల్గొని ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. దీంతో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శైలజ, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో మల్లీశ్వరి చేతుల మీదుగా మెమొంటోను, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

## క్షతగాత్రులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


తిరుతమ్మతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు తిరుపతమ్మ, బోడ పద్మ, బోడ రాంసింగ్‌ను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటర మణారెడ్డి ఆదివారం పరామర్శించారు. మంజూర్‌నగర్‌లోని వంద పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ నూనె రాజు, గణపురం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, బీబీచారి తదితరులు ఉన్నారు.

## బాలాలయం నిర్మాణ పూజలు

రేగొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఉగాది పర్వదినాన బాలాలయ నిర్మాణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ భిక్షపతి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం అర్చకులు బుచ్చమాచార్యులు మంత్రోచ్చరణల మధ్య దర్వాజను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీధర్, ఓంకార్, కళావతి, భక్తులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్‌రూంను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు


సీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెట్టిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక వర్తక, వాణిజ్యరంగాల ప్రతినిధులు, పలు అసోసియేషన్లు, పలు రాజకీయపార్టీల నాయకుల భాగస్వా మ్యం, సహకారంతో కాటారం పోలీసులు సుమారు రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన 63 కెమెరాలు, వాటిని అనుసంధానం చేస్తూ బిగించిన సీసీసీని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఎస్పీ కిరణ్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న మంత్రి శ్రీధర్‌బాబుకు పోలీసులు గౌరవవందనం సమర్పించారు. స్టేషన్ ఆవరణలో మంత్రి, ఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ సున్నిత ప్రాంతమైన కాటారం సబ్ డివిజన్‌లో పోలీసులు నిరంతరాయంగా అప్రమత్తంగా ఉంటూ సేవలందిస్తు న్నారని కొనియాడారు. ఓ వైపు అడవులు, మరో వైపు రెండు రాష్ట్రాలతో సరిహద్దులు కలిగిన ప్రాంతంలో పోలీసులు శాంతిభద్ర తల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయ మన్నారు. ప్రజలను భాగస్వాములుగా చేసి సీసీసీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మంచి చేసేవారితో ఫ్రెండ్లీ పోలి సింగ్ ఉండాలని, సంఘ వ్యతిరేకశక్తులు, ప్రశాంతతకు భంగం వాటిల్లజేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చెడు చేసేవారికి తాను ఎప్పుడూ సాయం చేయనన్నారు. బెట్టింగ్ యాప్‌లు, మాదకద్రవ్యాలపై సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరి స్తోందని స్పష్టం చేశారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ జిల్లాలో కాటారం మండలం సీసీ కెమెరాల ఏర్పాటులో ఆదర్శంగా నిలిచిందన్నారు. పోలీసులు డ్యూటీలవారీగా పనిచేస్తారని, సీసీ కెమెరాలు 24/7 నిరంతరాయంగా పనిచేసి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఒక సీసీ కెమెరా 10మంది పోలీసులకు సమానంగా పనిచేస్తుందని, ఇంత పెద్దఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ నెలకొల్పిన పోలీస్‌అధికారులను, సహకరించిన కమిటీని అభినందిస్తున్నానని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, కాటారం, మహా ము త్తారం, కొయ్యూరు, మహదేవపూర్, కాళేశ్వరం, పలిమెల ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్, నరేష్, ప్రవీణ్, తమాషారెడ్డి, రమేష్, సీసీ కెమెరాల నిర్వాహణ కమిటీ ప్రతినిధులు కలికోట శ్రీనివాస్, కవ్వాల శేఖర్, రఫీ, మాజీ ఎంపీపీ సమ్మయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఇంటింటా సంబురం

(5వ పేజీ తరువాయి)

ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలా ఉగాది సందర్భంగా హిందువుల ఇళ్లల్లో సందడి నెలకొంది.

**కళలతో ప్రజలను చైతన్యం చేయాలి**

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కవులు, కళాకారులు భూపాలపల్లిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ కవులు, కళాకారులు నిత్యం ప్రజలను చైతన్యం పరుస్తూ సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ హాస్య నటుడు ఆర్ఎస్.నందతోపాటు మరికొందరు కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. కవి సమ్మేళనంలో ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కవి సంజీవరావు, కాంగ్రెస్ నాయకులు సంపత్‌రావు, కిషన్, బుర్రకొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి ఆలయంలో వసంత నవరాత్రోత్సవాలు

వరంగల్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో ఉగాది పర్వదినం తొలి తెలుగు నూతన సంవత్సరం చైత్రమాసం ఆదివారం వసంత నవరాత్రోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి సన్నిధిలో ఈ ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం నిత్య పూజ అనంతరం మూల విరాట్ భద్రకాళి అమ్మవారికి అర్చకులు పూర్ణాభిషేకం నిర్వహించారు. అనంతరం అలంకరణ చేసిన తర్వాత వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్. నాగరాజుకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్ అమ్మవార్లను దర్శించుకున్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడిన చక్రి, సాయిచైతన్య, శ్రీరామమూర్తి

వెంకటాపురం/వాజేడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వెంకపటాపురం, వాజేడు మండలాల్లో ఆదివారం జరిగిన మూడు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వెంకటాపురం మండలంలోని ఆలుబాక-అబ్బాయి గూడెం గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమా దంలో ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆలుబాక గ్రామానికి చెందిన సాయిచైతన్య ద్విచక్రవాహనంపై అబ్బాయిగూడెం గ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆలు బాక గ్రామ సమీ పంలోకి చేరుకో గానే వాహన వేగాన్ని అదుపు చేయలేక పల్టీ కొట్టింది. దీంతో కిందపడ్డ సాయి చైతన్య తలకు గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు 108వాహనంలో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరి స్థితి విషమంగా ఉండడంతో ములుగు ఏరియా వైద్య శాలకు తరలించారు. అలాగే మండలంలోని చిరుతపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాచపల్లి గ్రామానికి చెందిన సోర్లం చక్రి ద్విచక్రవాహనంపై వెంకటాపురం నుంచి వాజేడు వైపు బయలుదేరాడు. ఈక్రమంలో చిరుతపల్లి సమీపంలోకి చేరుకోగానే వాహన వేగాన్ని అదుపుచేయలేక పల్టీలు కొట్టింది. దీంతో చక్రికి తీవ్ర గాయలు కావడంతో స్థానికులు 108వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

**ఇసుక లారీ ఢీకొని..**

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ద్విచక్రవాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టిన సంఘటన వాజేడు మండలంలో చోటు చేసుకుంది. వెంకటాపురం మండలం బర్లగుడెం గ్రామా నికి చెందిన తాటి శ్రీరామమూర్తి వ్యక్తిగత పని మీద వాజేడు మండ లంలోని ప్రగళ్లపల్లికి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. వెంకటాపురం వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇసుక లారీ ముందు ఉన్న ఆర్టీసీ బస్సును ప్రగళ్లపల్లి వద్ద ఓవర్‌టేక్ చేయబోయి ద్విచక్రవాహ నాన్ని ఢీకొ ట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న శ్రీరామమూర్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల చొరవతో 108 సిబ్బంది అతడిని ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. శ్రీరామమూర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## గ్రూప్-1లో మెరిసిన రత్నాలు

(5వ పేజీ తరువాయి)


గోపీకృష్ణను సన్మానిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కవి, రచయిత రవి

చేసి విఫలమయ్యాడు. 2021లో మెయిన్స్ వరకు వెళ్లాడు. తెలంగాణ గ్రూప్-1 నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పట్టుదలతో చదివిన ఆయన మెరుగైన ర్యాంకు సాధించాడు. అయితే గ్రూప్-2, 3,4లో కూడా రాష్ట్రస్థాయి ర్యాంకులతో మనోజ్ సత్తా చాటాడు. గ్రూప్-2లో 694, గ్రూప్-3లో 83వ ర్యాంకు పొందాడు. గ్రూప్-4లో 1300 ర్యాంకు సాధించిన మనోజ్ ప్రస్తుతం ములుగు డిస్ట్రిక్ట్ ట్రెజరీలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతని చెల్లెలు హన్వితరెడ్డి కూడా చదువుల తల్లే. ఆమె ఇటీవల సింగరేణి సంస్థలో డాక్టర్‌గా ఉద్యోగంలో చేరారు.